క్లుప్తంగా

ఫస్ట్ ఎయిడ్ కిట్ల పంపిణీ



ఫస్ట్ ఎయిడ్ కిట్‌లను ఆర్టీసీ అధికారి శ్రీనివాసరావుకు అందజేస్తున్న ఆస్పత్రి యాజమాన్యం

విజయనగరం టౌన్: ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు చేపట్టాలని తగరపువలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి జీఎం గణేష్ పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో అత్యవసరమైన ప్రథమ చికిత్స కిట్‌లను మంగళవారం డిపో అధికారి శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్సలను అందించేందుకుగానూ 230 కిట్‌లను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ఆస్పత్రి యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

అంధుల పాఠశాలకు ఇన్వర్టర్ అందజేత



అంధుల పాఠశాలకు ఇన్వర్టర్ అందజేస్తున్న ఉష

విజయనగరం ఫూల్‌బాగ్: ఒడిశా (కుర్తారోడ్)కు చెందిన పూతి ఉష తన కుమారుడు రాజేష్ జ్ఞాపకార్థం నగరంలోని ఫూల్‌బాగ్‌లో ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలకు ఇన్వర్టర్‌ను మంగళవారం అందజేశారు. అంతకు ముందు పట్టణ నిరాశ్రయుల వసతిగృహంలో ఉన్నవారికి నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత అటవీ అధికారి మజ్జి రామారావు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మహేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు బొత్స సూర్యనారాయణ, పి.లక్ష్మీ సురేష్, నిరాశ్రయుల వసతిగృహం కో ఆర్డినేటర్ వి.రాజేష్ పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

విజయనగరం ఫూల్‌బాగ్: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగులకు ఐదురోజులు అదనపు సెలవులు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.అప్పలసూరి, బి కాంతారావు మంగళవారం ఒకప్రకటనలో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విభాగాల మహిళాఉద్యోగులకు ఈ జీవో అమలు అయ్యే విధంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగులకు కూడా చైల్డ్‌కేర్ లీవులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

గంజాయి పీలుస్తున్న నలుగురి అరెస్టు

విజయనగరం క్రైమ్: గంజాయి పీలుస్తున్న నలుగురు యువకులను రూరల్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. స్థానిక వేణుగోపాలపురం వద్ద ఉన్న డైట్ కళాశాల సమీపంలో గల ఖాళీస్థలంలో గంజాయి పీలుస్తున్న నలుగురు యువకులను సీఐ తిరుపతిరావు, ఎస్సై గణేష్‌ల ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తిరుపతిరావు తెలిపారు.

మైనర్లకు బైక్‌లిస్తే కఠిన చర్యలు

మైనర్లకు బైకులిస్తే తల్లిదండ్రులపై చట్టప్రకారం చర్యలు తప్పవని టూటౌన్ సీఐ సీహెచ్. లక్ష్మణరావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి పట్టణంలోని టూటౌన్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రంకన్ డ్రైవ్‌తో పాటు మైనర్లు బైక్‌లపై విచ్చలవిడిగా తిరుగుతున్నట్లు గుర్తించామన్నారు. దీంతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, కేసులు నమోదుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై పైడితల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

86 మంది రక్తదానం

విజయనగరం: విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోట జంక్షన్ సమీపంలో గల విజయ బ్లడ్ బ్యాంక్‌లో మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి జన్మదినోత్సవ సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. వేసవికాలం దృష్ట్యా రక్తం నిల్వలు కొరత కారణంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తామాష్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయొచ్చని తెలియజేశారు. రక్తదానం మహాదానమని, ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేసిన వారవుతారన్నారు. శిబిరంలో 86మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయగా... సేకరించిన రక్త నిల్వలు విజయ బ్లడ్ బ్యాంక్‌కి ఇవ్వడం జరిగిందని చెప్పారు. 50 మంది హెచ్ఐవీ రోగులకు ఆహార పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయికుమార్, రాయల్ క్యాబ్స్ శరత్, విజయ్, రాము, రఘు, వినయ్, వికాస్, రాజు, బ్లడ్ బ్యాంక్ మేనేజర్ పుణ్యమంతుల శివ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర ప్రక్రియగా అభివృద్ధి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 14వ డివిజన్‌లో రూ.42.90 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం



14వ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల , నగర మేయర్

విజయనగరం: జిల్లా కేంద్రంలో నిరంతర ప్రక్రియగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. నగరంలో చేపడుతున్న ప్రారంభోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం 14వ డివిజన్‌లో రూ.42.90 లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభోత్సవం చేశారు. ఆయన రాకను పురస్కరించుకొని స్థానికులు, నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. పూలమాలలతో సత్కరించారు. మహిళలు హారతులు పట్టారు. పులిగెడ్డ వారి వీధిలో రూ.9.95 లక్షల వ్యయంతో నిర్మించిన రహదారిని, రూ.23 లక్షలతో చేపట్టిన డాగ్ షెడ్ రోడ్డును ప్రారంభించారు. అనంతరం కుమ్మర వీధిలో రూ.9.95 లక్షలతో చేపట్టిన రహదారులను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. ప్రారంభోత్సవాల అనంతరం డివిజన్ కార్పొరేటర్ ఎస్‌వీవీ రాజేష్, జోనల్ ఇన్‌చార్జి ముచ్చు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. తమ డివిజన్‌లోని సుమారు రూ.43 లక్షలతో పూర్తయిన పనులకు ప్రారంభోత్సవం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఎన్నో ఏళ్లనాటి సమస్యలను పరిష్కరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. తద్వారా నగరంలో ప్రధాన జంక్షన్ల అభివృద్ధితో పాటు ప్రజల కనీస మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతిదేవి, పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, కాళ్ల సూరిబాబు, జి.శ్రీనివాసరావు, ఇసరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ పుట్టినరోజు వేడుకలు



పేదలకు వస్త్రదానం చేస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మీ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మెగా రక్తదానం నిర్వహించి 123 యూనిట్ల రక్తం సేకరించారు. వినికిడి లోపం ఉన్న పలువురికి వినికిడి పరికరాలు, చేయూత కర్రలు, హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం, 100 మందికి వస్త్రదానం చేపట్టారు. కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రేమ సమాజం, కోట జంక్షన్, వివిధ ఆలయాలలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రక్తదానం ప్రాణ దానంతో సమానమన్నారు. రక్తదానం చేసిన ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యాసంస్థల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంకల్ప ర్యాలీ రేపు

విజయనగరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 13న విజయనగరం జిల్లా కేంద్రంలో తలపెట్టిన సంకల్ప ర్యాలీని విజయవంతం చేయాలని అంబేడ్కర్ అందరివాడు సాధన సమితి ప్రతినిధి బొంగ భానుమూర్తి పిలుపునిచ్చారు. దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుని స్ఫూర్తిని చాటి చెప్పాలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చర్యలు చేపట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. రాష్ట్రంలో సామాజిక న్యాయానికి ప్రతీకలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నిలుస్తారని పేర్కొన్నారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో 125 అడుగుల డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని రూ. 384 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టడం శుభ పరిణామం పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బాలాజీ జంక్షన్‌లో కొత్త కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయటం ఎస్సీ, ఎస్టీల పట్ల కోలగట్ల వీరభద్రస్వామికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తోందని వాఖ్యానించారు. సమావేశంలో విజయనగరం కార్పొరేటర్లు దాసరి సత్యవతి, పొట్నూరు శ్రీనివాసరావు, పట్నాన పైడిరాజు, ఉత్తరాంధ్ర అంబేడ్కర్ రైట్స్ కన్వీనర్ గంట వీర్రాజు, రాంజీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పొట్నూరు చంద్రశేఖర్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్య క్షుడు లక్ష్మణరావు, నారాయణమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్ మత్స్య భరోసా పథకంపై అవగాహన



మాట్లాడుతున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్

భోగాపురం: మండలంలోని ముక్కాం గ్రామంలో వైఎస్సార్ మత్స్య భరోసా పథకంపై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ షరీఫ్ మత్స్యకారులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రంలో జల సంపదను కాపాడేందుకు ఈ నెల 15వ తేదీ నుంచి 2023 జూన్ 14 వరకు చేపల వేటను నిలిపివేస్తూ ప్రభుత్వం అదేశాలు జారీ చేసిందన్నారు. మత్స్య సంపద వృద్ధి కోసం చేపట్టే నిషధాజ్ఞలను తప్పనిసరిగా పాటించాలన్నారు. బోట్లలో చేపల వేట చేయరాదని సూచించారు. వేట నిషేధ సమయంలో ప్రభుత్వం వైఎస్సార్ మత్స్య భరోసా కింద రూ.10 వేలను అర్హులైన మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తుందని తెలిపారు. 18 – 60 ఏళ్ల మధ్య వయసు ఉండి, ఆధార్‌తో బ్యాంకు ఖాతా లింకైన వారికి పథకం ప్రయోజనం అందుతుందని చెప్పారు. మత్స్యకారులు తమ యొక్క బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో లింకు చేసుకున్న మత్స్యకారులకు ఈ నెల 17వ తేదీన ఈకేవైసీ కొరకు సచివాలయం వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు. తెప్పలకు సంబంధించిన కోడ్ తప్పనిసరిగి ఉండాలని, దరఖాస్తుదారులు వారి ఆధార్, రైస్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, తెప్ప రిజిస్ట్రేషన్ మరియు లైసెన్స్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని తెలిపారు. వాసుపల్లి రొయ్యుడు, మత్స్యకారులు పాల్గొన్నారు.

పైడితల్లికి పుష్పాలంకరణ



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం , కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం భక్తులకు పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం సిరిమానుపూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన బూరెలతో నైవేద్యం సమర్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అసోసియేషన్ ఏకగ్రీవం

- అధ్యక్షుడిగా ప్రయాగుల పైడిరాజు, కార్యదర్శిగా నరసింహులు



ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని మంగళవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి పీఎస్‌వీశివప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యాలయంలో జరిగిన ఎన్నిక ప్రక్రియలో ఈ మేరకు నూతన కమిటీని ప్రకటించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ప్రయాగుల పైడిరాజు, కార్యదర్శిగా ఎ.నరసింహులు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వి.భానుప్రసాద్ ఎంపికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా భరద్వాజ్ చక్రవర్తి వ్యవహరించే ఈ కమిటీలో వైస్ ప్రెసిడెంట్స్‌గా ఎ.కిశోర్, వి.బాబ్జీ, జాయింట్ సెక్రటరీలుగా జీవీఎస్ఎన్ మూర్తి, పి.రవికుమార్, కోశాధికారిగా ఎస్.శంకరరావుతో పాటు వివిధ ఎలక్ట్రానిక్ మీడియా నుంచి మరో 8 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పి.అప్పారావు, విజయనగరం ప్రెస్ క్లబ్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు జీవీప్రసాద్, ఎలిశెట్టి సురేష్‌కుమార్, వీఎంకే లక్ష్మణరావు, వైఎస్‌పంతులు, టి.రాధాకృష్ణ, వేదుల సత్యనారాయణ, ఎం.భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే అనుబంధ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది.

ఫుడ్ బ్యాంక్‌ల సేవలు అభినందనీయం

- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



ఫుడ్ బ్యాంక్‌లో పేదలకు అన్నం వడ్డిస్తున్న కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: నగరంలో అన్నార్తుల ఆకలిని తీర్చే ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు కావడం అభినందనీయమని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు అన్నారు. కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఫుడ్ బ్యాంకును ఆయన మంగళవారం పరిశీలించారు. అన్నదాన కార్యక్రమం వివరాలను అడిగి తెలుసుకున్న కమిషనర్ స్వయంగా పేదలకు ఆహారాన్ని వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సలహాలు సూచనలతో నగరంలో ఐదు ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు కావడం సంతోషదాయకమన్నారు. పేదలు, అన్నార్తులకు ఫుడ్ బ్యాంకులు ద్వారా ఆహారాన్ని సమకూర్చడం స్ఫూర్తిదాయకమన్నారు. కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యులు ఆశపు వేణు మాట్లాడుతూ నగరంలో ఏర్పాటు చేసిన 5 ఫుడ్ బ్యాంకులు ద్వారా ప్రతి రోజు 800 మంది వరకు పేదలకు ఆహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఫుడ్ బ్యాంకులు ద్వారా రోజు 150 మంది వరకు ఆహారాన్ని సమకూరుస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫుడ్ బ్యాంక్ నిర్వాహకులు ఇప్పిలి శ్రీనివాసరావు, సింహాద్రి శంకరరావు, నామాల సర్వేశ్వరరావు, వేముల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు పూలే...



నెల్లిమర్ల: పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, అంధవరపు సూరిబాబు



విజయనగరం టౌన్: జోనల్ వర్క్‌షాప్‌లో పూలే జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ రవికుమార్



విజయనగరం టౌన్: ఆర్టీసీ డిపో ఆవరణలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు, తదితరులు

మహిళాభ్యున్నతికి విశేషమైన కృషి చేసి భావితరాలకు స్ఫూర్తిగా నిలిచిన దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే పలువురు వక్తలు కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా పలుచోట్ల కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాల్లో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు పూటే చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఇతర ప్రాంతాల్లో కూడా పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అధికారులు, కార్మికులు, ప్రజలు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

చెట్టును ఢీకొన్న లారీ

బొండపల్లి: మితిమీరిన వేగంతో విజయనగరం నుంచి గజపతినగరం వైపు వస్తున్న బెంజ్ లారీ అదుపు తప్పి జాతీయ రహదారి 26 పక్కన గల మామిడి చెట్టును ఢీకొంది. మంగళవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు భారీ ప్రమాదం జరగకుండా డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఇక లారీ రోడ్డుకు అడ్డంగా జాతీయ రహదారిపై నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని అడ్డంగా నిలిచిపోయిన లారీని భారీ క్రేన్ సహాయంతో పక్కకు తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

నేడు 'అరబిందో'జాబ్ మేళా

పార్వతీపురం టౌన్: స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతచలపతిరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అరబిందో ఫార్మా కంపెనీలో 275 ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలను స్కిల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో కంపెనీ ప్రతినిధులు నిర్వహిస్తారని తెలిపారు. ఇంటర్, బీఎస్సీ కెమిస్ట్రీ, బి.ఫార్మసీ, మెకానికల్ డిప్లమో కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వైబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

గడప గడపకు సంక్షేమం

- ప్రభుత్వంపై ప్రజా స్పందన అనూహ్యం
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



గడప గడపకు కార్యక్రమంలో పథకాల అమలుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో గడప గడపకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని కొండకరకాం గ్రామంలో మంగళవారం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన ప్రజా స్పందన చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అడుగడుగునా జన నీరాజనం పట్టారు. గజమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అవినీతి అక్రమాలు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా తమకు అందుతున్నాయని ప్రజలు ఆయనకు తెలిపారు. స్థానిక సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కోలగట్ల మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు నగర పరిధిలో వివిధ వార్డుల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించామని, మండల పరిధిలోని కొండకరకాం గ్రామం నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించామన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించడంతో పాటు ప్రజా స్పందనను తెలుసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జెడ్పీటీసీ కెల్లా శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, సర్పంచ్ కిలారి రమ్య, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ వెంకట్రావు, ఎంఈఓ రాజు, పలు గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో జ్యోతిరావు పూలే స్థానం సుస్థిరం



కలెక్టరేట్ ప్రాంతంలో విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు

విజయనగరం: మహాత్మా జ్యోతి రావు పూలే జాతికి చేసిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కొనియాడారు. పూలే 197వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ సమీపంలోని జ్యోతి రావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్లతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన వెంకటఅప్పలనాయుడు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కృషిచేసిన జ్యోతి రావు పూలే మహనీయుడని కొనియాడారు. బాలికా విద్యకు ఆయన ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని, బాలికలకోసం, వెనుకబడిన వర్గాల కోసం పాఠశాలలు స్థాపించారని చెప్పారు.

పూలే సేవలు చిరస్మరణీయం

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ జ్యోతి రావు పూలే జాతికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఉద్ఘాటించారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేశారని చెప్పారు. అందుకే 197 సంవత్సరాల క్రితం పుట్టిన జ్యోతి రావు పూలే, ప్రజల హృదయాల్లో నేటికీ నిలిచిఉన్నారని కొనియాడారు. విద్యార్థికి వసతిగృహ సంక్షేమాధికారి బి.జానకిరావు సొంతంగా రూ.5వేల నగదు బహుమతిని అతిథుల చేతులమీదుగా అందజేశారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, బొబ్బిలి శాసన సభ్యుడు శంబంగి వెంకట చినప్పలనాయుడు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఎం.యశోదనరావు, వివిధ బీసీ సంఘాలు, సంస్థలు, పార్టీల ప్రతినిధులు ఆశపు వేణు, ముద్దాడ మధు, భీశెట్టి బాబ్జీ, బీసీ సంక్షేమాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



Thank You CM Sir
మా ప్రత్యక్ష దైవం మీరే జగనన్నా...
మా ఊపిరి ఉన్నంత వరకు మీ వెంటే అన్నా...
వైఎస్సార్ అభిమానిగా...
వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి గారి అనుచరుడిగా...
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ...
జగనన్న ఆశయాలను నెరవేర్చే సైనికుడిగా...
నిరంతరం సాగుతానని మాటిస్తూ...
నాకు మరోసారి శాసనమండలి సభ్యులుగా
అవకాశం కల్పించిన ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు
గౌ॥శ్రీ వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి
హృదయపూర్వక
కృతజ్ఞతాభివందనములు
పెనుమత్స వి.వి.సూర్యనారాయణరాజు
(డా॥ సురేష్‌బాబు)
శాసనమండలి సభ్యులు , విజయనగరం